హరహర మహాదేవ శంభో శంకర


స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో పరమేశ్వరస్వామి జాతర
- స్వామివారి రథోత్సవానికి వందలాదిగా తరలివచ్చిన భక్తజనం
- శివనామస్మరణతో పులకించిన ఆత్మకూర్

ఆత్మకూర్: పట్టణంలోని చెరువు మధ్యలో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. వందలాది భక్తులు స్వామివారికి దాసంగాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారి రథోత్సవం కనులపండువగా జరిగింది. వందలాది భక్తజనం నడుమ స్వామివారు రథంపై ఊరేగారు. ఈ సందర్భంగా శివనామస్మరణతో ఆత్మకూర్ మార్మోగింది. అంతకుముందు వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పట్టణ పురవీధుల గుండా స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ఉత్సవాల్లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతర కమిటీ కన్వీనర్ వెంకట నర్సింహారావు,


కోలాటం ఆడుతున్న చిన్నారులు


పల్లకీలో ఊరేగుతున్న పరమేశ్వరస్వామి

నిర్వాహకులు సాయిరాఘవ, మణివర్ధన్‌రెడ్డి, యాదగిరిశెట్టి, నాగేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, రవికాంత్, పరమేశ్, తులసీరాజ్, శ్రీను, దామోదర్, మహేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి


నిరసన దీక్షలో పాల్గొన్న సీపీఐ నాయకులు

ఆత్మకూర్/అమరచింత: ఆత్మకూర్ పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడాలను తొలగించాలంటూ డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక దీక్ష శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు మాట్లాడుతూ.. అక్రమ కట్టడాలను కూల్చే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. పట్టణంలోని బాబా కాలనీలో టీఎన్జీఓ భవనం పక్కన ఉన్న 20 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వెంచర్లలో అన్యాక్రాంతమైన 10 శాతం స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీహరి, మోష, సీఎస్ శెట్టి, అబ్రహం, భాస్కర్, రవీందర్, శేఖర్, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణశెట్టి, కుమార్, బాలస్వామి, రాంచందర్, గీత, కృష్ణవేణి, పద్మ, మాసమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

❐ ఆత్మకూర్‌లో ప్రభుత్వ స్థలాలతో పాటు ముస్లిం మైనార్టీలకు చెందిన స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఖుతుబ్ డిమాండ్ చేశారు. అమరచింత మండలంలోని కొంకన్వానిపల్లిలో సీపీఐ నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూర్‌లో బంగారు శ్రీను అనే వ్యక్తి ప్రభుత్వ రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేస్తున్నాడన్నారు. ఇంటి నిర్మాణానికి మున్సిపల్ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారో చెప్పాలంటూ మూడు రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని.. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అంజి, శ్రీను, వెంకటేశ్, రాములు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



పాన్‌గల్: చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సీహెచ్‌ఓ రామయ్య సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని బండపల్లి హెల్త్ సబ్ సెంటర్‌లో వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించడంతో భవిష్యత్‌లో అంటు వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. దీంతో పాటు గర్భిణులకు సకాలంలో మొదటి, రెండవ డోస్ టీటీ వ్యాక్సిన్ వేయాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులు వైద్యుల సూచనలు పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పు చేయించుకునేలా సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రమాదేవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

వనపర్తి రూరల్: మండలంలోని నాగమ్మతండా పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠ్యాంశాలు బోధించారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అదే విధంగా కడుకుంట్ల వివేకానంద శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకొన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్, మాజీ సర్పంచ్ హరిత, పాఠశాల కరెస్పాండెంట్ బాలకృష్ణ, హెచ్‌ఎం గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


నాగమ్మతండాలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

చెరుకు బకాయిలు చెల్లించండి

అమరచింత: కృష్ణవేణి చెరుకు ఫ్యాక్టరీకి చెరుకు తరలించిన రైతులకు బకాయి డబ్బులను వెంటనే చెల్లించాలని కృష్ణవేణి చెరుకు రైతుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చెరుకు కోతలను సకాలంలో పూర్తిచేసిన ఫ్యాక్టరీ యాజమాన్యం.. మార్చి రెండో వారంలో రూ. 10కోట్ల బకాయిలను చెల్లిస్తామని ప్రకటించిందని తెలిపారు. బకాయిలను వెంటనే పూర్తిచేయాలన్నారు. వచ్చే సంవత్సరంలో చెరుకు రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్రం వాటాతోనే అభివృద్ధి పనులు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించే రూ. 721 కోట్ల అభివృద్ధి పనుల్లో కేంద్ర ప్రభుత్వ వాటా ఉందన్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మరిచిపోకూడదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మున్నూర్ రవీందర్ అన్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకోవడం కాకుండా.. ప్రారంభించిన పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ప్రజలకు సభావేదికగా ప్రకటించాలన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం వాటా లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిలో ముందడుగు వేసే అవకాశం ఉండేది కాదని అన్నారు. జిల్లా కేంద్రంలో అసంపూర్తిగా మిగిలిన రోడ్ల విస్తరణపై దృష్టి సారించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద లబ్ధిదారులకు మౌలిక వసతులు కల్పించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అవగాహన లేకుండా బీజేపీపై విమర్శలు చేస్తున్నారన్నారు. రెండు సీట్లతో ప్రారంభమైన బీజేపీ.. దేశంలో ప్రస్తుతం 243 లోక్‌సభ, 92 రాజ్యసభ సభ్యులతో 20 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న సంగతి మరచిపోవద్దన్నారు. అమలుకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఉద్దెర మాటలతో కాలం వెల్లదీస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ హంగామాను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు కుమారస్వామి, ఆర్.వెంకటేశ్వర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ

పైప్‌లైన్ లీకేజీతో అవస్థలు



అమరచింత: పట్టణంలోని సవారమ్మ దేవాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు ఉన్న ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ పథకం పైప్‌లైన్ లీకేజీతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఓవైపు తాగునీరు వృథా కావడంతో పాటు మరోవైపు రోడ్డు గుంతలమయంగా మారుతోంది. తాగునీటి పైప్‌లైన్ లీకేజీతో బీటీరోడ్డు దెబ్బతింటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతు బాధ్యత తమది కాదంటే తమది కాదని ఇటు మిషన్ భగీరథ సిబ్బంది, అటు మున్సిపల్ సిబ్బంది పేర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'పుర' కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్

వనపర్తిటౌన్: మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా జీఓ 28 ప్రకారం ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఫీజు చెల్లించిన వారికి 25 శాతం లభిస్తుందని పేర్కొన్నారు. తద్వారా భూ యజమానులు తమ స్థలాలకు చట్టబద్ధమైన హక్కులను పొందవచ్చన్నారు. భవిష్యత్‌లో నిర్మాణాలకు మార్గం సుగమం అవుతుందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ చార్జీలపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 25శాతం రాయితీ భూ యజమానులపై ఆర్థిక భారం తగ్గిస్తుందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ 2025 ద్వారా అనధికార లేఅవుట్లను చట్టబద్ధం చేయడం భూ యజమానులకు భద్రత, అభివృద్ధి అవకాశాలను అందిస్తుందని చెప్పారు. పూర్తి వివరాలకు పుర కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

ఖిల్లాఘనపురం: మద్యం మత్తులో వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన ఖిల్లాఘనపురంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన గుడ్డటోళ్ల నాగరాజు శుక్రవారం రాత్రి తన స్నేహితుడు అల్లమాయపల్లికి చెందిన బాలరాజుతో కలిసి మద్యం తాగడానికి వెళ్లాడు. మద్యం తాగుతున్న క్రమంలో ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకుంది. నాగరాజుపై బాలరాజు కర్రతో దాడికి పాల్పడంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య సంతోష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం విఫలం

కొల్లాపూర్: ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం విఫలం అయ్యిందని బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకుడు దారా శేఖర్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కనీసం 50 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం వెంటనే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు జయరాం, మాసూమ్‌బాబా, మహ్మద్ సోహైల్, శివ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న శేఖర్

కిచెన్ గార్డెన్‌తో తాజా కూరగాయలు

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌తో మధ్యాహ్న భోజనానికి తాజా కూరగాయలు, ఆకుకూరలు లభిస్తాయని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని చింతకుంట ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలతో పాటు పాఠశాల ఆవరణలోని కిచెన్ గార్డెన్ పరిశీలించారు. కిచెన్ గార్డెన్‌లో గోంగూర, పాలకూర, బీరకాయ, సొరకాయ వంటి కూరగాయలతో పాటు బొప్పాయి వంటి పండ్లను పండించడం అభినందనీయమన్నారు. పాఠశాల ఆవరణ మొత్తం పచ్చటి మొక్కలతో నిండి ఉందన్నారు. ఇటీవలే పాఠశాలకు దాతల సహకారంతో మైక్‌సెట్ అందజేసినట్లు ఆయన తెలిపారు. హెచ్‌ఎం నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

➪ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఎంఈఓ పరిశీలించారు. విద్యావలంటీర్ సుజాత సాయంత్రం పాఠశాల సమయం పూర్తయిన తర్వాత కూడా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి చదివించడం అభినందనీయమన్నారు. ప్రత్యేక తరగతులకు సమయాన్ని కేటాయించిన విద్యావలంటీర్‌కు పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్ యాదవ్ ప్రతినెలా కొంత పారితోషికం అందిస్తున్నట్లు తెలిపారు.


చింతకుంట పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

పాన్‌గల్: గిరిజన తండాలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. శనివారం మండలంలోని తెల్లరాళ్లపల్లి తండాలో స్థానిక సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా జీపీలకు నిధులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడం, వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. అన్ని గ్రామాల్లో స్థానిక సమస్యలపై చేపట్టిన సర్వే అనంతరం వాటి పరిష్కారం కోసం ప్రజలతో కలిసి పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాబునాయక్, చిట్టెమ్మ, రవినాయక్ పాల్గొన్నారు.


తెల్లరాళ్లపల్లి తండాలో సమస్యలపై ఆరా తీస్తున్న బాల్యానాయక్

మాజీ ఎమ్మెల్యేలకు గుర్తింపు

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలో చదువుకున్న సీఎం రేవంత్ రెడ్డి గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వడం అభినందనీయమని అఖిలపక్ష ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ అన్నారు. ఆదివారం సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లుగా అఖిలపక్ష ఐక్యవేదిక పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. సమీకృత రెసిడెన్షియల్ స్కూల్ భవనాలకు జయరాములు పేరు, 500 పడకల ఆస్పత్రికి డా.బాలకిష్టయ్య పేరు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అదేవిధంగా జయరాములు విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, శంకర్, పుట్టపాక బాలు, యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, శ్రీనివాసులు, పాషా ఉన్నారు.


మాట్లాడుతున్న సతీష్‌యాదవ్

మాదిగ అమరవీరులకు ఘననివాళి

మదనాపురం: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో జరిగిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనే ధ్యేయంగా ఉద్యమించినట్లు తెలిపారు.


అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పేదల సంక్షేమానికి పెద్దపీట

మక్తల్/మాగనూర్: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలం గుర్లపల్లి గ్రామానికి చెందిన శంకరమ్మ వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 1.70లక్షల ఎల్‌ఓసీని శనివారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యం, ఇతర కారణాలతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే పేదలను ప్రభుత్వం సీఎం సహాయనిధితో అన్నివిధాలా ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్, ఆనంద్‌గౌడ్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, నారాయణ, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

➪ మాగనూర్ మండల తాజా మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య ఆకస్మిక మరణం బాధాకరమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటయ్య శుక్రవారం చికిత్స పొందుతూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న వారు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వెంకటయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నేటి నుంచి మంత్రాలమ్మ బ్రహ్మోత్సవాలు


మంత్రాలమ్మ మూలవిరాట్

కోడేరు: మండలంలోని జనుంపల్లి శివారులో వెలిసిన షిడే బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు హాజరు కానున్నారు.

కోర్కెలు తీర్చే కొంగు బంగారం..

జనుంపల్లికి చెందిన పర్లగొర్ల వంశస్తులు తమ గొర్రెలను కర్నూల్ జిల్లా ఆత్మకూర్ మండలం కనుమ అనే అడవుల్లో గొర్రెలను మేపేందుకు తీసుకెళ్లారు. గొర్రెలకు వివిధ రోగాలు సోకి మరణిస్తుండటంతో ఏమి చేయాలో తోచని సదరు కాపరి కలలో అమ్మవారు ప్రత్యక్షమై జనుంపల్లి గ్రామ శివారులో అమ్మవారిని ఏర్పాటు చేయాలని సూచించింది. అతడు గ్రామస్తులతో చర్చించి పర్లగొర్ల వంశస్తులు అమ్మవారిని దేవాలయాన్ని నెలకొల్పారు. ప్రతి ఏడాది శివరాత్రి అనంతరం అమ్మవారికి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి

భక్తుల సౌకర్యార్థం జాతరలో అన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశామని తెలిపారు.

గోవుల తరలింపు అడ్డగింత

ఆత్మకూర్: గోవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని యువకులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ నరేందర్ వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి మండలంలోని పిన్నంచర్ల వైపు బొలేరో వాహనం అతివేగంగా రావడంతో గ్రామ యువకులు అశోక్‌నంద, నీలారెడ్డి, అశోక్, కళ్యాణ్, శివ అడ్డుకుని తనిఖీ చేశారు. వాహనంలో తొమ్మిది గోవులు ఉండటంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఫయాజ్, హమీద్ అక్రమంగా ఆవులను తరలిస్తున్నట్లు గుర్తించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆవులను పిన్నంచర్లలోని గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ఖిల్లాఘనపురం: జిల్లా కేంద్రంలోని చిట్యాల ఎంజేపీ గురుకులంలో శనివారం నిర్వహించిన పీఎంశ్రీ సైన్స్, గణిత మేళాలో మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎం.అక్షిత, జె.అనిత, ఎం.ప్రవస్సిలు విద్యుత్ వినియోగంలో ఆదాపై ప్రయోగం రూపొందించి ప్రదర్శించగా.. ప్రశంసాపత్రం అందజేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. సైన్స్, గణిత మేళాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు అందుకు కృషిచేసిన ఉపాధ్యాయులు మమత, విజయ్‌కుమార్‌లను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఘనంగా ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవం



కొత్తకోట రూరల్: పట్టణంలోని మదీనా నగర్ చౌక్‌లో శనివారం ఎంఐఎం 65వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎండీ రహీం ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఖదీర్ ఖాజా, కార్యదర్శి ఖాలీక్, సోషల్ మీడియా ఇన్‌చార్జి సయ్యద్ నవీద్, ఫైసల్, నజరా, ఖయ్యూం, కరీం, సైఫ్ అలీఖాన్, మసూం, సాదిక్ పాల్గొన్నారు.

బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లల గుర్తింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బరువు తక్కువ ఉన్న చిన్నారులకు పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి పౌష్టికాహారం అందించారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


రెవెన్యూ డివిజన్ ఏర్పాటు హామీ నిలబెట్టుకోవాలి



ఆత్మకూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్ చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం సీఎం పర్యటనలో ఆత్మకూర్ రెవెన్యూ డివిజన్ ప్రకటన చేయాలని కోరారు. ఇందుకు స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు ఆనంద్, సూరి, సమద్, బాలకృష్ణ, వెంకట్రాములు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వనపర్తి రూరల్: జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వనపర్తి మండలం చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటి బచావో – బేటి పడావో అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం బాలికా విద్య – సామాజిక బాధ్యత అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి.. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. హెచ్‌ఎం గణేశ్‌కుమార్, ఉపాధ్యాయులు గిరిరాజాచారి, రవి, సంజీవయ్య, రుద్రమదేవి, షఫి, గోపాల్, స్వరూప, సీఆర్పీ రవికుమార్ పాల్గొన్నారు.



మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
వనపర్తి | ఎం. జగదీశ్వర్ | - 9912370010
కొత్తకోట / పెబ్బేర్ | ఇ. రాజశేఖర్ గౌడ్ | - 97000 09392
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1093

సాక్షి – పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
యాడ్స్ మేనేజర్ 9951602829
జబ్బర్ లాల్ : 9553955603